క్లుప్తంగా

8న సభ

కడప కల్చరల్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీన గ్రంథాలయోద్యమ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో సాయంత్రం 5.00 గంటలకు సభ నిర్వహించనున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఎస్.ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు తెలిపారు. ప్రస్తుత సమాజంలో పుస్తకాలకు ఆదరణ తగ్గిపోతోందని, గ్రంథాలయాల అభివృద్ధికి చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. గ్రంథాలయాల పట్ల సమాజంలో ఏర్పడిన స్తబ్దతను పోగొట్టడానికి గ్రంథాలయ పునర్వికాస వేదిక కృషి చేస్తుందని తెలిపారు.

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి



వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవీ రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరు విలువలతో కూడిన విద్యనభ్యసించాలని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి అన్నారు. కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజనీరింగ్(సిస్ట్)లో శనివారం శ్రీనివాసా విద్యాసంస్థల చైర్మెన్ బి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల మూడు దశాబ్దాలుగా విద్యార్థులకు సాంకేతికంగా ఉన్నతమైన విద్యనందిస్తోందన్నారు. కళాశాల చైర్మెన్ బి. శ్రీనివాసులు మాట్లాడుతూ ఫార్మారంగాన్ని బలోపేతం చేసే ఉద్దేశ్యంతో నిర్మల ఫార్మసీ కళాశాలను ప్రారంభించామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, నాయకులు హరిప్రసాద్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

సాహిత్య వారసత్వం కాపాడాలి


ఉగాది పురస్కారాలు అందుకున్న జిల్లా రచయితలకు సత్కారం

కడప కల్చరల్ : జిల్లా సాహిత్య వారసత్వ సంపదను కాపాడవలసిన బాధ్యత మీపైనే ఉందని అతిథులు అన్నారు. ఇటీవల ఉగాది పురస్కారాలు అందుకున్న జిల్లా కవులను శనివారం ఇంటాక్ సంస్థ స్థానిక మానస సమావేశ మందిరంలో సత్కరించింది. సంస్థ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి అధ్యక్షతన వైవీయూ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్‌రెడ్డి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా, డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీర సుదర్శన్‌రెడ్డి, కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, మునిరెడ్డి తదితరులు పురస్కార గ్రహీతల సాహితీ సేవలను కొనియాడారు. పురస్కార గ్రహీతలు మొగిలిచెండు సురేష్ మాట్లాడుతూ జిల్లాలో జరిగే కార్యక్రమాలు తనను రచన వైపు మళ్లించాయన్నారు. డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయమే తనను రచయితగా మార్చిందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేంపల్లె షరీఫ్ మాట్లాడుతూ తాను జన్మించిన ఈ జిల్లా అంటే తనకెంతో ఇష్టమని, ఇక్కడ పడిన కష్టాలే తనను రచయితగా మార్చాయన్నారు. డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, పాత్రికేయులు సూర్యనారాయణరావు మాట్లాడారు.

పరామర్శ


సంజీవరాయుడును పరామర్శిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, సురేష్ బాబు, అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ నాయకుడు సంజీవరాయుడును ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ కె. సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇటీవల కిమ్స్‌లో చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ను వారు కలిసి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, పి. జయచంద్రారెడ్డి, దాసరి శివప్రసాద్, షఫీ, దేవిరెడ్డి ఆదిత్య పాల్గొన్నారు.

సమాజానికి దార్శనికుడు జగ్జీవన్

కడప ఎడ్యుకేషన్: సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి బాబు జగ్జీవన్‌రామ్ అని డీఈఓ షేక్ షంషుద్దీన్, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని శనివారం కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లోని మూల్యాంకన కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఎస్ఎల్‌టీఏ నాయకులు అంకాల్ కొండయ్య, గంగాధర్, ఎస్ఆర్‌టీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, ఏపీటీఎఫ్ నాయకులు అబ్దుల్లా, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ నాయకులు గంగరాజు, ప్రేమ్‌కుమార్, జయరాముడు, రాజబాబు, జేవీవీ నాయకులు దేవదత్తం, హెచ్ఎం మేరీ, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ బాదుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– నేటి సమాజానికి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దార్శనికుడని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి పురస్కరించుకొని శనివారం కడపలోని మున్సిపల్ కార్పొరేషన్ (మెయిన్)హైస్కూల్ లో పదవ తరగతి పరీక్ష మూల్యాంకన కేంద్రంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎజాస్ అహమ్మద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రూతు ఆరోగ్య మేరి, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గోపినాథ్, బి.చంద్ర శేఖర్, కేదార్నాథ్, ఎ.డి.దేవదత్తం, ప్రకాశ్ బాబు, పవన్ కుమార్, రవి, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

– డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ అర్ట్స్ యూనివర్సిటీలో బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ విశ్వనాథకుమార్ సిబ్బందితో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవితేజ, సయ్యద్ అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ ప్రదాత

కడప సెవెన్‌రోడ్స్ : భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ సామాజిక న్యాయ ప్రదాత అని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున అన్నారు. శనివారం జగ్జీవన్ 118వ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి తొలుత పూలమాలలు వేసి అనంతరం తమ పార్టీ కార్యాలయంలో జయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పోరాడిన సమతా మూర్తిగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గున్న జయరాం, వై.మల్లయ్య, జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వైఎం ప్రతాప్‌రెడ్డి, బీసీ మహాసభ జిల్లా అధ్యక్షులు టీవీ రమణ, సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి బందెల ఓబయ్య, ఎమ్మార్పీ జాతీయ అధ్యక్షులు సంగటి మనోహర్, మహాజన్, వివిధ సంఘాల నాయకులు జేవీ రమణతోపాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కడప రిమ్స్‌లో బాబూ జగ్జీవన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, వైద్యులు, వైద్య సిబ్బంది

బడుగుల ఆశాజ్యోతి

పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం అలుపెరగక శ్రమించిన ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని ఏపీ దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కైపు రామాంజనేయులు అన్నారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.బాబు, జిల్లా కన్వీనర్ ఆర్.సుబ్బరాయుడు, కో కన్వీనర్ సి.బాబు, లక్ష్మీప్రసాద్ తదితరులు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

భారత జాతిరత్నం జగ్జీవన్

వివిధ జాతులు, మతాలు, కులాల సమ్మేళనమైన భారతదేశంలో అణగారిన వర్గాల శ్రేయస్సు కోసం జగ్జీవన్ ఎంతో శ్రమించారని జయంతి వేడుకల కమిటీ అధ్యక్షులు పెద్దలపల్లి ఓబులపతి, ఉపాధ్యక్షులు పాన్నోలు సుబ్బరాయుడు, నాయకులు పచ్చారం బాలు, బీసీ గంగులు కొనియాడారు. ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నాయకులు పి.మోహన్, జి.గోపి, రవి, రాయల్ రమణ, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ నివాళి

దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె.మునెయ్య ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు శనివారం బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

హక్కుల పోరాట స్వరం

సామాజిక న్యాయం, పేద, బడుగు, బలహీన వర్గాల హక్కుల పోరాట స్వరం బాబు జగ్జీవన్‌రామ్ అని రెవెల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డీఎం ఓబులేశు కొనియాడారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది సూర్య వంశీ యాదవ్, బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ ఎంప్లాయిస్ విభాగం జిల్లా అధ్యక్షులు వేణు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవ యోధుడు జగ్జీవన్ రామ్

కడప అర్బన్: సామాజిక విప్లవ యోధుడు డా.బాబూ జగ్జీవన్ రామ్ అని ఆయనకు దేశం యావత్తు నీరాజనాలు అర్పిస్తోందని జీజీహెచ్ రిమ్స్ సిఎస్ ఆర్ఎంఓ డాక్టర్ వై.శ్రీనివాసులు కొనియాడారు. శనివారం రిమ్స్ ఓపీ విభాగం లో డా. బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడం, వివక్షను నిర్మూలించడంలో ఆయన చేసిన కృషికి గుర్తుగా ఆయన జన్మదినాన్ని భారత ప్రభుత్వం 'సమతా దివస్' గా పరిగణించిందన్నారు. సమతా దివస్ అంటే సమానత్వం అని అన్నారు. చిన్న వయసులోనే రాజకీయాల్లోకి వచ్చి సుదీర్ఘకాలం పాటు పార్లమెంట్‌లో వివిధ మంత్రిత్వ శాఖలలో ఆయన సేవలందించారన్నారు. ఈ కార్యక్రమం ముందుగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ ఆర్ఎంఓ డాక్టర్ రాజేశ్వరి, డిప్యూటీ సీఎస్ ఆర్ఎంఓలు గీత, డాక్టర్ రాఘవేంద్ర, గ్రేడ్‌-1 నర్సింగ్ సూపరింటెండెంట్ మాధురీలత, కేసి.జి.ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప మహనీయుడు

కడప వైఎస్ఆర్ సర్కిల్: అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని మహావీర్ సర్కిల్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి వేణుగోపాల్, కే.సి.బాదుల్లా , దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కానగల మునయ్య, పార్టీ నాయకులు ఓబులేసు, సుబ్బరాయుడు, నాగేశ్వరరావు, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో...

కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కడప రామకృష్ణ నగర్ లో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేవీపీఎస్ జిల్లా సీనియర్ నాయకులు జితేంద్ర, ఐఎన్ సుబ్బమ్మ , జిల్లా నాయకులు జార్జి శేఖర్, స్థానిక నాయకులు రమణ, ప్రవీణ్, శ్రీను, వెంకటసుబ్బయ్య, గోవింద్, భాస్కర్, గంగాధర్, అంజి, శివ, బాలు, రవి, జన విజ్ఞాన వేదిక నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నగరంలోని మహావీర్ సర్కిల్‌లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.


జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న వివిధ సంఘాల నేతలు


జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపకులపతి విశ్వనాథ్‌కుమార్, సిబ్బంది


జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఈఓ షంషుద్దీన్, ఉపాధ్యాయులు


బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మూల్యాంకన రుసుం పెంచాలని వినతి

కడప ఎడ్యుకేషన్: పదవతరగతి మూల్యాంకన విధులలో పాల్గొన్న సిబ్బందికి చెల్లించే రుసుము పెంపుదల చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి కోరారు. ఈ విషయమై శనివారం కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లోని మూల్యాంకన కేంద్రంలో డీఈఓ షేక్ షంషుద్దీన్, డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డిలకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ మూల్యాంకన విధులలో పాల్గొన్న సిబ్బందికి చెల్లించే రుసుం 50% శాతం పెంపుదల చేయాలన్నారు. పరీక్ష పేపర్లు దిద్దడానికి ఒక్కొక్క పేపరుకు 20 రూపాయలను చెల్లించాలని, స్పెషల్ అసిస్టెంట్లుగా నియమితులైన టీచర్లకు టిఎ, డిఎ లను చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఒక పూట సిబ్బందికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు రామచంద్రారెడ్డి, నరసింహులు, రమణయ్య, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఛలో కార్పొరేషన్‌ను జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగర ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న నిర్వహిస్తున్న ఛలో కార్పొరేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని రామకృష్ణ నగర్ ,వైఎస్ఆర్ కాలనీ, మృత్యుంజయకుంట, నాగరాజు పేట, ఎస్టేట్, ప్రకాష్ నగర్ తదితర ప్రాంతాలలో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరాన్ని అభివృద్ధి పేరుతో పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నామని పాలకులు చెప్పిన మాటలు సామాన్య ప్రజానీకానికి ఏమాత్రం ఉపయోగపడే స్థితిలో లేవని విమర్శించారు. అభివృద్ధి కేవలం ప్రధాన రోడ్లకు మాత్రమే పరిమితమైందని అన్నారు. విలీనమైన పంచాయతీల్లో అభివృద్ధి కనపడడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి. దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు కుమారస్వామి రెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, గోవిందు, సరిత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి


వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కడప అర్బన్ : రోడ్డు భద్రతపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా జిల్లాలో రోడ్డు భద్రతపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ అధికారులు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం, సీటు బెల్టు ఉపయోగించకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. విద్యార్థులు రోడ్ క్రాస్ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మైనర్‌లకు వాహనం ఇవ్వకూడదని తల్లి దండ్రులకు సూచించారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపడం వల్లనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయన్నారు.

నగరానికి నవమి శోభ

- ఉత్సాహ భరితంగా ఏర్పాట్లు
- కల్యాణానికి వేదికలు సిద్ధం

కడప కల్చరల్ : నగరంలోని రామాలయాలు నవమి శోభను సంతరించుకున్నాయి. నగరంలో పండుగ సందర్భంగా దాదాపు అన్ని రామాలయాలలో విశేష పూజలు నిర్వహించనున్నారు. ఇప్పటికే కడప నగరంలోని దాదాపు అన్ని వైష్ణవాలయాలు పండుగ నిర్వహణ కోసం సిద్ధమవుతున్నాయి. ఆలయ కమిటీ పెద్దలు, భక్తబృందాలు, యువ భక్తుల బృందాలు అవసరమైన సరంజామా సేకరణలో నిమగ్నమయ్యారు. పలు ఆలయాల వద్ద పందిళ్లు కళకళలాడుతున్నాయి.

ఘనంగా ఏర్పాట్లు

ఆదివారం ఉదయం 10.00 గంటల నుంచి అన్ని రామాలయాలలో శ్రీరామ నవమి పండుగను వేడుకగా నిర్వహించుకుంటున్నారు. పలు ఆలయాల వద్ద, ప్రధాన రోడ్లు, కూడళ్లలో ఇప్పటికే భారీ హోర్డింగ్‌లు, దేవతామూర్తుల కలర్ లైట్లతో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయడంతో నగరంలో పండుగ శోభ ఉట్టిపడుతోంది. మామిడాకుల సేకరణ, పానకం, వడపప్పు తయారీ తదితరాలలో యువ భక్తుల బృందాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఆలయ కమిటీ పెద్దల ఆధ్వర్యంలో కొన్ని దేవాలయాలలో భక్తులందరికీ భారీగా అన్నదానం నిర్వహించనున్నారు.

నగరంలో..

కడప నగరంలో హౌసింగ్‌బోర్డు కాలనీలోగల శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోపుగా శ్రీ సీతారామ కల్యాణం నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. అలాగే ఇందిరానగర్‌లోని శ్రీ భద్రాద్రి రామాలయం, జవుళి బజారులోని శ్రీ కోదండ రామాలయం, నాగరాజుపేట బేల్దారివీధి శ్రీ కోదండ రామాలయం, నెహ్రూనగర్ రామాలయం, ఆంజనేయస్వామివీధి కోదండ రామాలయం, నాగరాజుపేట కోదండ రామాలయం, సింహపురి కాలనీ, రవీంద్రనగర్‌లోని శ్రీ సీతారామాలయం, హబీబుల్లావీధిలో శారదానిలయం హైస్కూలు వద్దగల శ్రీ సీతారామస్వామి ఆలయం, అరవిందనగర్ శ్రీ రామాలయం, మారుతినగర్ సీతా రామాలయం, భాగ్యనగర్ రామాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు నిర్వహించనున్నారు.


సింహపురి కాలనీలో శ్రీరామ కల్యాణానికి ఏర్పాటు చేస్తున్న వేదిక


అరవిందనగర్ రామాలయం వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిరి

బిషప్ పట్టాభిషేక మహోత్సవానికి ఏర్పాట్లు


బిషప్ పట్టాభిషేక ఏర్పాట్లు పరిశీలిస్తున్న క్రైస్తవ పెద్దలు


నిర్మాణంలో ఉన్న పట్టాభిషేక వేదిక

కడప కల్చరల్ : కథోలిక డయాసిస్ నూతన బిషప్ పట్టాభిషేక మహోత్సవానికి మరియాపురం చర్చి ఆవరణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 9వ తేదీన ఆరవ బిషప్‌గా రెవరెండ్ సగినాల పాల్ ప్రకాష్ పట్టాభిషేకం చేయనున్న విషయం తెలిసిందే. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు అత్యంత ఘనంగా చేస్తున్నామని మేత్రాసన వికర్ జనరల్ తలారి బాలరాజు, కోశాధికారి సంబటూరు సురేష్‌లు తెలిపారు. మరియాపురం ఫాదర్ కంబ్లిష్ ప్రాంగణంలోని సెయింట్ జోసెఫ్ హై స్కూల్ బిషప్ అరుళయ్య వేదికపై జరుగుతున్న పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి నాలుగు జిల్లాల మేత్రాసన కాపరిగా సగినాల పాల్ ప్రకాష్ బిషప్ పట్టాభిషేకం జరగనుందని, ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ఢిల్లీ నుండి పోప్ దూత నున్షియో, లియోపోల్డ్ గేరిల్లి, హైదరాబాదు నుండి కార్డినల్ పూల అంతోని, బిషప్ సగిలి ప్రకాష్‌తో పాటు దేశ నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో బిషప్‌లు, ఫాదర్లు, క్రైస్తవ పెద్దలు, రాష్ట్ర, జిల్లా అధికారులు రానున్నారని వారు తెలిపారు. అతిథులతోపాటు ప్రజలందరికీ భోజన వసతి కల్పిస్తున్నామని తెలిపారు. వేదిక సమీపంలోనే వాహనాల పార్కింగ్, మంచినీరు, సౌకర్యాలు కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. 9వ తేదీ ఉదయం 8:30 గంటలకు మరియాపురం పాత చర్చి నుండి పురవీధుల గుండా బిల్లప్ మీదుగా అరుళయ్య వేదిక వద్దకు క్రైస్తవ భక్తి గీతాలతో, కేరళ వాయిద్య కళాకారుల నడుమ ఊరేగింపుగా చేరుకోనున్నారని తెలిపారు. కార్యక్రమంలో బిషప్ పట్టాభిషేక స్టీరింగ్ కమిటీ సభ్యులు, ఫాదర్ విజయరావు, ఫాదర్ చైతన్య, చర్చి పెద్దలు ఎండి ఆల్ఫోన్స్, హలో రాజు జోజప్ప జైపాల్ యాగప్ప, సగిలి గుర్రప్ప, విక్టర్, జ్యోతి జార్జి మడగలం ప్రసాద్ పాల్గొన్నారు.

నీటి కొరతను తీర్చాలి

కడప రూరల్: కడప నగరంలోని గౌస్‌నగర్‌లో నీటి కొరత సమస్యను తీర్చాలని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఖాదర్‌బాష తెలిపారు. ఆ మేరకు శనివారం కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌస్‌నగర్‌లో అధిక శాతం పేద ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు. ఇక్కడ ఎక్కువగా నీటి కొరత ఉందని తెలిపారు. రానున్న రెండు నెలల్లో నీటి సమస్య మరింత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ చర్యల ద్వారా నీటి కొరతను నివారించాలని కోరారు. కార్యక్రమంలో అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రాలు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజమండ్రిలో ఆర్ట్స్ కాలేజ్ దగ్గర 'అమరావతి చిత్రకళ వీధి' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ శాఖ ఏర్పాటు చేసిన చిత్రకళ స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు కృష్ణ రాజు, రాజమండ్రి ఎమ్మెల్యే వాసు, ప్రోగ్రాం ఇన్చార్జ్ తేజస్వి ప్రతి స్టాల్ వద్దకు వచ్చి వర్కులను వీక్షించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం నుంచి ఆరు స్టాళ్లు ఏర్పాటు చేశామని ఫైన్ ఆర్ట్స్ శాఖ విభాగాధిపతి డా.కె. మృత్యుంజయరావు తెలిపారు. అధ్యాపకులు వెంకటేష్, వీరప్ప, విద్యార్థులు ముత్యం పునీత్ బలరాం, సింహాద్రి, దేవదాసు పాల్గొని స్టాల్స్ లోని చిత్రాల గురించి వీక్షకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దాదాపుగా వెయ్యి మందికి పైగా ఆర్టిస్టులు పాల్గొన్నారని తెలిపారు.

రాష్ట్ర చిత్రకళ ప్రదర్శనలో వెంకటేశ్వర్లుకు ప్రశంస

కడప కల్చరల్ : రాజమహేంద్రవరంలో రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన చిత్రకళా వీధి ప్రదర్శనలో కడప నగరానికి చెందిన ఏసీ వెంకటేశ్వర్లుకు ప్రత్యేక ప్రసంస లభించింది. సీనియర్ చిత్రకారుడైన ఈయన చిత్రాలను తిలకించిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా కొనియాడారు. అనంతరం ఆయనకు ప్రశంసాపత్రాన్ని అందజేసి సత్కరించారు.

ఎస్సీ ఎస్టీ కాలనీల్లో నవమి సామగ్రి పంపిణీ

కడప కల్చరల్ : తిరుమల–తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు, కడప, అన్నమయ్య జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లోని ఆలయాల్లో శ్రీరామనవమి పర్వదిన సందర్భంగా నిర్వహణకు అవసరమైన సామాగ్రిని ఆయా ఆలయాల అర్చకులకు అందజేశారు. ఈనెల 6న మనగుడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాకు సంబంధించి 29 దేవాలయాలలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. తిరుమలేశుని సన్నిధి నుంచి తెచ్చిన కంకణాలు, కుంకుమ, బ్రోచర్లు ఆలయాలలో భక్తులకు పంచనున్నట్లు తెలిపారు. టీటీడీ దేవస్థానం ఆధ్వర్యంలో అర్చక శిక్షణలో శిక్షణ పొందిన అర్చకులకు నిత్య పూజా కైంకర్యాల నిర్వహణ కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ కడప జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపి బాబు, టీటీడీ ధర్మ ప్రచార మండలి సభ్యులు రామ మహేష్ పాల్గొని పూజా సామాగ్రిని అందజేశారు.


నవమి సామగ్రి అందుకున్న అర్చకులు

మహా రాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి న్యాయస్థానము,కడప

OS No. 65/2024

Canara Bank [erstwhile Syndicate Bank],Represented by its Branch Manager,Main Branch-II,Kadapa. ..వాది

Vs

Sree Balaji Yuva Shakti Sangam, running unit in the name of M/s Sri Balaji Fly ash bricks industry in survey No. 98/4, Utukuru, C.K. Dinne Mandal having its registered address at D.No. 1/2147, APHB Colony, Kadapa City, represented by its Leaders and members.

1) K. Madan Mohan Reddy (1st leader), S/o. Maddileti Reddy, Hindu, aged 41 Years, Business, residing at D.No. 1/2147, APHB Colony, Kadapa City, Mob: 9951456946. **2) Y. Ashok Kumar Reddy (2nd leader), S/o. Narayana Reddy,** Hindu, age 36 Years, Business, residing at D.No. 1/2147-2, APHB Colony, Kadapa City, Mob: 9603535537. **3) K. Venkata Subba Reddy, S/o. Rami Reddy,** Hindu, age 50 Years, Business, residing at D.No. 1/2569, APHB Colony, Kadapa City. Mob: 9701299868. **4) K. Rami Reddy, S/o. Pedda Bali Reddy,** Hindu, age 47 Years, Business, residing at D.No. 1/917-2, Dwaraka Nagar, Kadapa City. Mob: 9866144246. **5) K. Mallikarjuna, S/o. K. Rama Murthy,** Hindu, age 44 Years, Business, residing at D.No. Yerramukkappalli, Kadapa City. Mob: 9966964952. ప్రతివాదులు 1–5

ప్రతివాదులకు సమన్లు

సందర్భానుసారంగా మీకు తెలియజేయడమేమనగా, పై దావా మీ హాజరు కొరకు **09.04.2025వ తేదీన ఉదయం 10.30 గం. లకు** పై తెలిపిన కోర్టు నందు వాయిదా ఉన్నది. కావున మీరు స్వయంగా గానీ, మీ తరఫున వకీలు ద్వారా గానీ హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.

By order of the Court

సి. వెంకట సుబ్బయ్య, B.A., B.L, వాది తరపు న్యాయవాది, సెల్: 9704890225.